క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

వెంకటగిరిరూరల్: స్థానిక తూర్పువీధిలోని మహాత్మా గాంధీ గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం పర్యావరణ పరిరక్షణపై వ్యాచరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. గ్రంథాలయ అధికారి అంజయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సత్కారం



వేలాయుధన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వాకాడు: స్థానిక ఎంపీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న నెల్లూరు వేలాయుధన్ బుధవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ నసీంఅలీ, సహచర ఉపాధ్యాయులు, పలువురు అధికారులు పాల్గొని శాలువతో సత్కరించి వేలాయుధన్ సేవలను కొనియాడారు. హెచ్‌ఎం పిడుగు ప్రవీణ్‌కుమార్, జాలాది కిషోర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



రాపూరులో చిత్రలేఖనం వేసిన చిన్నారులతో అధికారులు

రాపూరు: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని గ్రంథాలయ అధికారిణి ధనమ్మ పేర్కొన్నారు. రాపూరు గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 35రోజులపాటు ఈ వేసవి విజ్ఞాన కేంద్రాలు జరుగుతాయని విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు చివరిరోజ బహుమతులు అందిస్తామన్నారు. ఉపాధ్యాయుడు పెంచల నరసింహం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

-పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మరమ్మతుకు గురైన బోరును చూపిస్తున్న స్థానికులు

గూడూరురూరల్: రూరల్ పరిధిలోని అడివయ్య కాలని, తిలక్ నగర్, నెల్‌క్యాస్ట్ ప్రాంతాల్లో మూడు రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళితే ఎన్నికల కౌంటింగ్ పేరుతో సిబ్బంది లేరని సమాధానం ఇస్తున్నారని దీంతో చుక్క నీరు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని అన్నారు. తిలక్ నగర్‌లో ఒక బోరు వేసి డైరెక్ట్ పంపింగ్ కింద ఈ మూడు ప్రాంతాలకు రోజు మార్చి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ బోరు వద్ద పైప్ పూర్తిగా పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. తాగునీటిని సరఫరా చేసే సిబ్బంది అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో మూడు ప్రాంతాలతో పాటుగా టిడ్కో ఇళ్లలోని వారు మూడు రోజులుగా చుక్క నీరు లేక అల్లాడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేసి 1,500 కుటుంబాల దాహార్తిని తీర్చాలని వారు కోరుతున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చిల్లకూరు: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం తీరప్రాంత గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ మునిశేఖర్ తెలిపారు. బుధవారం చిల్లకూరు సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వరగలి గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో గల వరగలి, మోమిడి, గమ్మళ్లదిబ్బ, తమ్మినపట్నం, లింగవరం, తీగపాళెం, పల్లెవాని దిబ్బ, గ్రామాల్లో విద్యుత్‌ను నిలిపి వేస్తున్నామని అన్నారు. ఈ ప్రాంత వినియోగదారులు ఏదైనా అత్యవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖాధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

కండలేరులో 6.582 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 6.582 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మద్దెలమడుగులో అటవీశాఖ అధికారుల ర్యాలీ



మొక్కలు నాటుతున్న రేంజర్

రాపూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని రాపూరు అటవీశాఖ రేంజ్ అధికారి రవీంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మద్దెలమడుగులోని అటవీశాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించి, పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహించి సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం, అడవులను రక్షించడం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వలన అనేక నష్టాలు కలుగుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, పర్యావరణానికి హాని కలిగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతిని ఊపిరితిత్తులు, కేన్సర్ వ్యాధులకు గురవుతారని చెప్పారు. కాలుష్యం పెరిగితే ప్రాణవాయువు కొనుగోలు చేయవలసి వస్తుందన్నారు. భావితరాల మనుగడకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు.అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

వెంకటగిరిరూరల్: మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గోవిందరాజులు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం కృషివిజ్ఞాన కేంద్రంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఈ మేరకు విద్యార్థులు, యువతుల్లో చైతన్యం రావాలని పిలుపునిచ్చారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బి.వి జయశ్రీ, డాక్టర్ తిరుపాల్, డాక్టర్ నాగార్జునరెడ్డి, రాజీవన పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

పట్టణంలోని వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో ప్యానల్ అడ్వకేట్స్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ, రాజారావు, హరినాథరెడ్డి, చెంచుకృష్ణయ్య మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణ ఓ బాధ్యత

చిల్లకూరు: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని కేంద్ర కాలుష్య నియంత్ర మండలి అధికారిణి వరలక్ష్మి సూచించారు. బుధవారం తమ్మినపట్నంలోని జిందాల్ సింహపురి విద్యుత్ పరిశ్రమ యూనిట్ వారి నివాస సముదాయం సావిత్రి విహర్‌లో మొక్కలు నాటారు. ముందుగా కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ చేయిచేయి కలుపుదామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆ ప్రాంతంలోని పిల్లలతో పాటు పరిశ్రమలో పనిచేసే ఉద్యోగుల పిల్లలకు చిత్ర లేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. అలాగే సావిత్రి విహార్ ప్రాంతంలో విరివిగా మొక్కలు నాటారు. అలాగే పరిశ్రమ చుట్టు పక్కల



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు

ఉన్న గ్రామాల వారికి ఉచితంగా మామిడి మొక్కలను పంపిణీ చేశారు. పరిశ్రమ ప్రతినిధులు కే.శ్రీనివాసరావు, ఎస్ఏ మన్సూరి, సావిత్రి విహార లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలతరావు, షాహేర్‌భాను మన్సూరి, సరోజ్‌పాఠీ, ఆకుల నగేష్ పాల్గొన్నారు.

పర్యావరణం కాపాడుకోవాలి

గూడూరురూరల్: ప్రతిఒక్కరు ఒక మొక్కను నాటి భావితరాలకు కలుషితంలేని పర్యావరణం అందించేందుకు దోహదపడాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కోటేశ్వరరావు కోరారు. బుధవారం గూడూరులోని కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేశారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు ఎస్‌కే వహిదా, ఎంవీ. క్రిష్ణయ్య, వి.ప్రసాద్, బాలప్రదీప్, ఎం.ఈశ్వరయ్య, ఎస్‌కే.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్కలు నాటుతున్న గోవిందరాజులు



ప్రతిజ్ఞ చేస్తున్న వరలక్ష్మి

నిత్యం ప్రజల వెంటే ఉంటా!



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నేతలు

- ఆదరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతాభివందనాలు
- ప్రజాసమస్యలపై పోరాటాలకు సిద్ధం
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, ఎన్నికల్లో ఆదరించి కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు అందరికీ శిరస్సు వంచి కృతజ్ఞతాభివందనాలు తెలుపుతున్నానని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. పట్టణంలోని సంజీవయ్య నివాసం వద్ద బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి సంజీవయ్య విలేకరులతో మాట్లాడారు. తను మొదట ఐదేళ్లపాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజాసమస్యలపై అనునిత్యం పోరాడానని, మరో ఐదేళ్ల సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా నియోజవర్గంలో పార్టీలకు అతీతంగా కోట్లాది నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో విద్య, వైద్యం వ్యవసాయ రంగాలతో పాటు మహిళ సాధికారత, అన్ని వర్గాల అభివృద్ధికి జగనన్న కృషిచేశారన్నారని చెప్పారు. వ్యతిరేకంగా వచ్చిన ఊహించని ఓటమికి సంబంధించి జగనన్నతో కలిసి సమీక్షిస్తామని చెప్పారు. మూడవ సారి ఓటమి ఎదురైనా తనను ఆదరించిన పార్టీ శ్రేణులు అభిమానులు, ప్రజల వెంట అనునిత్యం ఉండి వారి సమస్యలపై శాంతియుత పోరాటాలకైనా సిద్ధమని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక అమలుచేయాలని, వారికి తమ సహకారం అందిస్తామన్నారు. తనను ఆదరించిన అధికారులకు సైతం సంజీవయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన 24 గంటలకు కూడా కాక ముందే టీడీపీ శ్రేణులు దాడులు చేయడం, అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మంచి పరిపాలన అందించి ప్రజల నుంచి మెప్పుపొందాలని సూచించారు. అందరం జగనన్న నాయకత్వంలో పనిచేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, పాదర్తి హరినాథ్ రెడ్డి, నేతలు కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, కట్టా భవాని, సోమశేఖర్‌రెడ్డి, తంబిరెడ్డి మోహన్ రెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, గంధవల్లి సిద్ధయ్య, రవి, రాము, రఘు, రాజేష్, రాహుల్, అశోక్ కుమార్, ముత్యాల రెడ్డి, షేక్ రహతుల్లా, జిలానీ, షేక్ షబ్బీర్, షేక్ రఫీ, కళాచంద్ర పాల్గొన్నారు.

ఎవరూ అధైర్య పడొద్దు



సమావేశమైన నేతలు

దొరవారిసత్రం: మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో బుధవారం ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి, చెంగాళ్లమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి డీవీ సత్రంలో సమావేశం నిర్వహించారు. ఓటమికి గల కారణాలపై నాయకులతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గెలుపు కోసం గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేసినప్పటికీ ఓటమి పాలైమని ఎవరూ డీలా పడొద్దని దువ్వూరు తెలియజేశారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వం నుంచి ఏ అన్యాయం జరగకుండా పోరాడుదామని దువ్వూరు నేతలు పేర్కొన్నారు. నేతలు రమణారెడ్డి, మునస్వామినాయుడు, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, మధురెడ్డి, బాబురెడ్డి, బాబునాయుడు పాల్గొన్నారు.

టీడీపీకే ప్రజలు పట్టం

- టీడీపీకి 1,09,724 ఓట్లు
- వైఎస్సార్‌సీపీకి 81,362 ఓట్లు
- 28,362 మెజారిటీతో విజయశ్రీ విజయం

సూళ్లూరుపేట: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో సూళ్లూరుపేట అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ గెలుచుకుంది. టీడీపీ నుంచి పోటీ చేసిన నెలవల విజయశ్రీకి ఈవీఎంల ద్వారా 1,09,724 ఓట్లు సాధించి 28,362 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యకు 81,362 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ లోనూ టీడీపీకే ఆధిక్యత వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో టీడీపీకి 1,324 ఓట్లు, వైఎస్సార్‌సీపీకి 571 ఓట్లు వచ్చాయి. దీంతో మొత్తంగా తీసుకుంటే టీడీపీకి 1,11,048 ఓట్లు, వైఎస్సార్‌సీపీకి 81,933 ఓట్లు వచ్చాయి. 22 రౌండ్లుగా జరిగిన కౌంటింగ్‌లో మూడో రౌండ్‌లో 69, ఏడో రౌండ్‌లో 72 ఓట్లు మాత్రమే కిలివేటి సంజీవయ్యకు మెజారిటీ కనిపించింది. విజయశ్రీ మిగిలిన 20 రౌండ్లు తన ఆధిక్యత చాటుకుంటూ చివరి రౌండ్ పూర్తయ్యేసరికి 28,362 ఓట్లు ఆధిక్యతతో విజయాన్ని అందుకుంది. నియోజకవర్గంలో 2,42,648 ఓట్లుకుగాను 2,01,186 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చందనమూడి శివకు 4,097. బీఎస్పీ అభ్యర్థి తొప్పాని రమణయ్యకు 657, ఎల్‌సీపీ అభ్యర్థి కందాటి రజనీకాంత్‌కు 516, ఎస్‌డబ్ల్యూపీ అభ్యర్థి బిగువు శ్రీనివాసులుకు 181, ఇండింపెండెంట్ అభ్యర్థులు ఒకరికి 592, బురకాల లీలామోహన్‌కు 367, టీఎస్ రాఘవులకు 280 ఓట్లు, నోటాకు 3,410 ఓట్లు పడ్డాయి.

మండలాల వారీగా పరిశీలిస్తే..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పరిశీలిస్తే టీడీపీకే ప్రజలు పట్టం కట్టారు. అన్ని మండలాల్లో టీడీపీ తన ఆధిక్యతను చాటుకుంది. ఓజిలి మండలంలో 494 ఓట్లు, పెళ్లకూరు మండలం 1,639, తడ మండలం 2,517, దొరవారిసత్రం మండలం 2, 226, సూళ్లూరుపేట మండలం, మున్సిపాలిటీ కలిపి 13,062, నాయుడుపేట మండలం, మున్సిపాలిటీ కలిపి 8,424 ఓట్లు టీడీపీకే వచ్చాయి. ఆరు మండలాల్లో వైఎస్సార్‌సీపీకి బలమైన నాయకత్వం వున్నప్పటికీ ఎవ్వరూ ప్రభావితం చేయలేకపోయారు. టీడీపీలో అంతర్గతంగా విభేదాలున్నప్పటికీ వాటిని ఉపయోగించుకోలేక వైఎస్సార్‌సీపీ నాయకత్వం చతికిల పడిందనే చెప్పాలి. అయితే పోస్టల్ బ్యాలెట్ నుంచి టీడీపీ తన ఆధిక్యతను చాటుకుంటూ వచ్చింది.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించండి



మొక్కలు నాటుతున్న అధికారులు

నాయుడుపేటటౌన్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని స్థానిక అటవీ శాఖ ఎఫ్‌ఆర్‌ఓ సునీల్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని బిరదవాడ గ్రామంలో ఉన్న అటవీశాఖ నగరవనంలో మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షించుకునే బాధ్యత వహించాలన్నారు. మొక్కల పెంపకంపై తమ శాఖ తరఫున ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాలు చేశారు. ఎఫ్‌ఎస్‌ఓలు ధనలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని మల్లాం జాతీయ రహదారి కూడలి సమీపంలో బుధవారం రాత్రి లారీ ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. 50 ఏళ్ల పైబడిన వ్యక్తి బుధవారం రాత్రి రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ వ్యక్తిని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ చక్రాలు అతని తలపై ఎక్కడంతో ముఖం సైతం గుర్తు పట్టలేనంతరగా ఛిద్రమైంది. ఈ విషయమై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలం వద్దకు ఎస్ఐ గోపితో పాటు హెడ్‌కానిస్టేబుల్ మధు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని ఫుల్ హ్యాండ్ తెలుపు చొక్కా, లైట్ బ్లూకలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైె లారీని స్వాధీనం చేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లుగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతని ముఖం ఆనవాళ్లు సైతం గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైన మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాల మార్చురీ గదిలో భద్రపరిచి అతని వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైదాపురంలో..



మృతి చెందిన వ్యక్తి

సైదాపురం: మండల కేంద్రం సైదాపురం బస్టాండ్ సెంటర్‌లో ఒక వ్యక్తి 2వ తేదీన అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నట్లు స్థానికులు వీఆర్‌ఓ హజరత్తయ్యకు సమాచారం అందజేశారు. దీంతో వీఆర్వో ఫిర్యాదు మేరకు ఆ గుర్తు తెలియని వ్యక్తిని 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు సైదాపురం పోలీసులకు సమాచారం చేరవేశారు. దీంతో పోలీసులు ఈ విషయమై కేసును నమోదు చేసి సమగ్ర విచారణ చేస్తున్నారు.

కేన్సర్‌పై అవగాహన ఉండాలి

తిరుపతి(తుడా): ప్రతి ఒక్కరూ కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ తెలిపారు. వైద్య కళాశాలలో బుధవారం ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి, చిన్న పిల్లల విభాగం వైద్యాధికారులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల కేన్సర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ వై.వెంకట్ లక్ష్మి, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్లు రోజారమణి, చండీప్రియ, సునీత పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు రాజాల అనుమతి

- 19, 20వ తేదీల్లో అమ్మవారి జాతర



ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ విబిసాయికృష్ణయాచేంద్ర వద్ద అనుమతులు తీసుకుంటున్న జాతర కమిటీ సభ్యులు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని బంగారుపేటలో శ్రీపోలేరమ్మ తల్లి జాతర నిర్వహణపై జాతర కమిటీ సభ్యులు బుధవారం వెంకటగిరిలోని రాజా ప్యాలెస్‌లో రాజా కుటింబీకులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ విబి సాయికృష్ణయాచేంద్రను మర్యాదపూర్వకంగా కలిసి జాతర నిర్వహణకు సంబంధించి సంప్రదాయబద్ధంగా తాంబూలం అందజేసి అనుమతులు తీసుకున్నారు. ఈనెల 16న ఘటోత్సవం, 19, 20వ తేదీల్లో అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి తొలి చాటింపు...

బుధవారం రాత్రి బంగారుపేటలో పోలేరమ్మతల్లి ఆలయం, హద్దు విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆసాదులు తప్పెట్లు, తాళ్లల మధ్య భక్తిశ్రద్ధలతో అమ్మవారి జాతర నిర్వహణపై తొలి చాటింపు నిర్వహించారు.

వర్షంతో వరి పైర్లకు ఊరట



పెళ్లకూరులో వరి సాగు

సైదాపురం: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరు పాటు వర్షం కురిసింది. దీంతో కైవల్యానదికి ఎగువ ప్రాంతాల నుంచి కూడా నీరు వచ్చి చేరుతుండడంతో కైవల్యా నదిలోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మ రైతులకు ఊరట..

నిమ్మ రైతులకు ఈ వర్షంఊరటనిస్తున్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో నిమ్మతోటలు బెట్టకు వచ్చాయి. ఈపరిస్థితుల్లో వర్షం కురుస్తుండడంతో నిమ్మచెట్లకు ఉపశమనం కలిగిస్తున్నాయని రైతులు తెలిపారు. వ్యవసాయాధికారులు తొందరపడి నార్లు పోసుకోవద్దని ఆర్బీకేల ద్వారా రైతులకు సమాచారం అందజేస్తున్నారు. బోరుబావులు ఉన్న రైతులు నీటి సదుపాయాన్ని బట్టి నార్లు పోసే కోవాలని ఏఓ హైమావతి రైతులకు సూచించారు.

డీవీ సత్రంలో వర్షం

దొరవారిసత్రం: మండలం పరిధిలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఎండ తీవ్రత తగ్గిపోయి చల్లటి గాలులు వీస్తూ అర్ధగంట పాటు వివిధ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. నెలబల్లి, డీవీ సత్రం, ఎస్ఎం అగ్రహారం, అక్కపాక, పోలిరెడ్డిపాళెం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలు కారణంగా వాతవరణం చల్లబడడంతో జనం ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు.

సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట రూరల్: మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. కోటపోలూరు రైల్వేఅండర్ బ్రిడ్జి మోకాల్లోతు వరకు వర్షపు నీరు చేరడంలో రాకపోకలు స్తంభించాయి. ఈ వర్షంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలను నమ్ముకుని రైతులు ఎడగారు సీజన్ కింద నాదేండ్లవారికండ్రిగ, కోటపోలూరు. మంగళంపాడు ప్రాంతాల్లో 600 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇలుపూరులో వేరుశనగ పంట వేశారు. ఈ వర్షాలవల్ల తెగుళ్లు ఉంటే వెళ్లిపోయే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి కవిత తెలిపారు.

సూళ్లూరుపేట: నైరుతి రుతుపవనాల రాకతో తొలకరి జల్లులు చల్లగా సూళ్లూరుపేట పట్టణాన్ని పలకరించాయి. అయితే వారం రోజులుగా ఎండలతో, ఉక్కపోతతో అల్లాడిపోయిన జనానికి రెండు మూడు రోజులుగా ఆకాశమంతా మేఘావృతమై చల్లటి గాలులు కూడా మెల్లగా పలకరించి కాస్తంత ఉపశమనాన్ని కలిగించాయి. దబుధవారం సాయంత్రం ఆకాశమంతా మేఘావృత్తమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. వర్షంతో రోడ్లపై వర్షపునీరు ప్రవహించాయి.

బాలాయపల్లిలో వడగళ్ల వాన

బాలాయపల్లి(సైదాపురం): మండలంలో బుధవారం మధ్యాహ్నం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. విపరీతమైన పెనుగాలులతో వడగళ్ల వర్షం కురిసింది. మండలంలోని అలిమిలి, వెంకటరెడ్డిపల్లి, అంబలపూడి, నిండలి గ్రామాల్లో పెనుగాలులు వీచడంతో సాగులో ఉన్న మామిడి పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నిమ్మ మొదల్లోకి చేరిన వర్షపు నీరు

వరిపైర్లకు ఊరట

పెళ్లకూరు: మండలంలో బుధవారం కురిసిన వర్షానికి వరి పైర్లకు ఊరట లభించింది. కొంతకాలంగా ఖరీఫ్ రైతులు సాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈతరుణంలో బుధవారం ఆకాశం మేఘావృతమై కురిసిన ఓ మోస్తరు వర్షానికి వరి పొలాల్లోకి నీరు చేరింది. దీంతో రైతులు ఆనందంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. చిల్లకూరు, పెళ్లకూరు, చావలి, తాళ్వాయిపాడు ప్రాంతాల్లో వరి సాగు చేస్తున్న రైతులంతా వర్షం పడడంతో ఊరట లభించడం వల్ల ఎరువులు వేసుకుంటామని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వెంకటరెడ్డిపల్లిలో పడిన వడగళ్లు



సైదాపురంలో కురుస్తున్న వర్షం



రైల్వే అండర్ బ్రిడ్జిలో చేరిన వర్షపు నీరు